RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక
వరంగల్ | బుధవారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ సీఎండీ & ఎడిటర్ 9701923260
సంపుటి: 4 సంచిక:93 | మార్చి 25, 2026 | వెల: రూ.3-00

## ఎలక్ట్రానిక్ వాహనాలు కొంటే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక డిస్కౌంట్



2లో



## మత మార్పిడి చేస్తే ఎస్సీ హోదా కోల్పోతారు

### కీలక తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు

- హిందూ, సిక్కు, బౌద్ధులకు మాత్రమే వర్తింపు
- హైకోర్టు తీర్పును సమర్ధించిన అత్యున్నత న్యాయస్థానం

వేద న్యూస్, డెస్క్

షెడ్యూల్ కులాల హోదాపై సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన దళితులు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని స్పష్టం చేసింది. ఈ మూడు మతాల పరిధిని దాటి ఇతర మతాలకు మారితే ఆ హోదా చెల్లదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ముఖ్యంగా మత మార్పిడి అంశంపై స్పష్టత ఇస్తూ ఈ తీర్పు ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. క్రైస్తవ మతాన్ని స్వీకరించిన వారికి షెడ్యూల్ కులాల హోదా వర్తించదని కోర్టు స్పష్టం చేసింది. ఒక దళిత వ్యక్తి మతం మార్చుకున్నట్లయితే, అతను ఎస్సీ హోదాను

మిగతా 2వ పేజీలో

## గ్యాస్ సంక్షోభంపై ప్రజలకు నిజాలు చెప్పాలి




- కొరత లేకుంటే హోటళ్లకు సరఫరా ఎందుకు నిలిపివేశారు
- గృహ వినియోగ దారులు కూడా ఇబ్బంది పడుతున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఆందోళన

2లో




పది పరీక్షలు పూర్తికాకముందే **మొదలైన కాలేజీల లొల్లి** విద్యార్థులను, తల్లిదండ్రులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న **కార్పొరేట్ శక్తులు**

## విద్యా వ్యాపారంగా..

# అడ్మిషన్ల దందా!

మీ పిల్లల్ని మా కాలేజీలోనే చేర్పించాలంటూ మాయమాటలు

2లో

- ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి తల్లిదండ్రులకు ఫోన్ల మీద ఫోన్లు
- పరీక్షలు ముగియక ముందే పొద్దున్నే ఇళ్ల వద్ద ప్రత్యక్షం
- గ్రామాల్లో కాలేజీల పీఆర్వోలతో ప్రత్యేక నెట్‌వర్క్
- విద్యార్థులను చేర్పించేందుకు రకరకాల ప్రలోభాలు
- ఒక్కో అడ్మిషన్‌కు రూ. 5వేల నుంచి రూ. 6వేల వరకు కమీషన్
- పరీక్షల వేళ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న వైనం
- రాష్ట్రంలోని విద్యాసంస్థల తీరుపై విస్మయం
- నిమ్మకు నీరెత్తినట్లు విద్యాశాఖ ఉన్నతాధికారులు

వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణలో పదో తరగతి విద్యార్థులు తమ జీవితంలో అత్యంత కీలకమైన వార్షిక పరీక్షలు రాస్తుండగా, మరోవైపు కార్పొరేట్ విద్యాసంస్థలు వారిని కేవలం లాభాలు తెచ్చిపెట్టే వ్యాపార వస్తువులుగా చూస్తూ అడ్మిషన్ల వేటను ముమ్మరం చేశాయి. పరీక్షలు ఇంకా పూర్తికాకముందే, ఫలితాలు రాకముందే సీట్ల రిజర్వేషన్ల పేరుతో కోట్లాది రూపాయల దందాను ఈ సంస్థలు సాగిస్తున్నాయి. విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీస్తూ, తల్లిదండ్రుల బలహీనతలను ఆసరాగా చేసుకుని కార్పొరేట్ శక్తులు అక్షరాన్ని అంగడి సరుకుగా మారుస్తున్నాయి.

## సపోటా పండులో విషం పెట్టి..

### చిన్నారిని హత్య చేసిన తండ్రి

- కుటుంబ కలహాలే ఘాతుకానికి కారణం
- యాదాద్రి జిల్లాలో దారుణం
- కేసు నమోదు చేసిన పోలీసులు



2లో



## నాకు మంత్రి పదవి ఇస్తే పార్టీకి మంచి పేరు వస్తుంది


- తనలాంటి ఉద్యమకారులే కాంగ్రెస్ బలం
- సీఎంతో ఎలాంటి విభేదాల్లేవు
- కేటీఆర్‌తో చర్చలు సాధారణమే..
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

2లో

## రైతులకు గుడ్ న్యూస్

### సాధాబైనామా సమస్యకు సరళ పరిష్కారం

- అఫిడవిట్ నిబంధనలో సడలింపు
- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి దారి
- భూ భారతి చట్టంలో కీలక మార్పులు
- జీవో 76తో ఊరట



2లో

## మత మార్పిడి చేస్తే
# ఎస్సీ హోదా కోల్పోతారు

మొదటి పేజీ తరువాయి

కోల్పోతాడని తెలిపింది. అంతేకాకుండా అటువంటి వ్యక్తి ఎస్సీ–ఎస్టీ చట్టం కింద రక్షణ పొందలేడని కూడా స్పష్టత ఇచ్చింది. జస్టిస్ పీకే మిశ్రా, మన్‌మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెల్లడించింది. ఈ కేసు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పాస్టర్ చిందాడ ఆనంద్ దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా విచారణకు వచ్చింది. తనపై కుల వివక్ష జరిగిందని పేర్కొంటూ ఆనంద్ ఎస్సీ–ఎస్టీ చట్టం కింద ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసును కొట్టివేయాలని అక్కాల రామిరెడ్డి హైకోర్టును ఆశ్రయించాడు. ఈ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆనంద్ క్రైస్తవ మతాన్ని స్వీకరించడంతో ఎస్సీ హోదా కోల్పోయాడని పేర్కొంటూ, అతని ఫిర్యాదుపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను రద్దు చేసింది. క్రైస్తవ మతాన్ని అనుసరించే వ్యక్తి ఎస్సీ–ఎస్టీ చట్టం కింద న్యాయం కోరలేడని హైకోర్టు తన తీర్పులో వెల్లడించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఆనంద్ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు నిర్ణయాన్నే సమర్థించింది. దీంతో మత మార్పిడి మరియు ఎస్సీ హోదా అంశంపై స్పష్టత వచ్చింది. ఈ తీర్పు భవిష్యత్తులో ఇలాంటి కేసులపై కీలక ప్రభావం చూపే అవకాశముందని న్యాయ నిపుణులు

## సపోటా పండులో
# విషం పెట్టి..

### చిన్నారిని హత్య చేసిన తండ్రి

- కుటుంబ కలహాలే దారుణానికి కారణం
- యాదాద్రిలో జిల్లాలో దారుణం
- కేసు నమోదు చేసిన పోలీసులు

**వేద న్యూస్, యాదాద్రి**

తెలంగాణ రాష్ట్రం యాదాద్రి జిల్లాలో హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. సంస్థాన్‌నారాయణపురం మండలం లచ్చలగూడెం గ్రామంలో ఒక తండ్రి సపోటా పండులో ఎలుకల మందు కలిపి తన చిన్నారిని హతమార్చిన ఘటన తీవ్ర కలకలం రేపింది. మూడు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా బయటపడింది. పోలీసుల వివరాల ప్రకారం, వరికుప్పల రవి అనే వ్యక్తికి మూడు సంవత్సరాల క్రితం స్వాతితో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల మేఘన, తొమ్మిది నెలల మయూరి అనే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో స్వాతి తన చిన్న కూతురితో పుట్టింట్లో ఉండగా, పెద్ద కూతురు మేఘన తండ్రి వద్దే ఉంది. పెద్ద కూతురిని తన వద్దకు పంపాలని స్వాతి పలుమార్లు కోరినా, రవి అంగీకరించలేదు. ఈ వివాదంపై స్వాతి మాడ్గులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు రవిని పిలిపించి మాట్లాడారు. ఈ సమస్యను పెద్దల సమక్షంలో పరిష్కరించాల్సి ఉండగా, రవి మాత్రం కడతేర్చే దారుణ నిర్ణయం తీసుకున్నాడు. శనివారం సపోటా పండులో ఎలుకల మందు కలిపి తన కూతురికి తినిపించాడు. విషం ప్రభావంతో చిన్నారి కొద్దిసేపటిలోనే వాంతులు చేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లింది. విషయం బయటపడుతుందనే భయంతో రవి కూడా నిద్రమాత్రలు, ఎలుకల మందు తీసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఇద్దరినీ ఆసుపత్రికి తరలించగా, చిన్నారిని నీలోఫర్ ఆసుపత్రిలో చేర్చినా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై తల్లి స్వాతి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ కలహాలు ఎంతటి దారుణాలకు దారి తీస్తాయో ఈ సంఘటన స్పష్టంగా చూపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఎలక్ట్రానిక్ వాహనాలు కొంటే
# ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక డిస్కౌంట్

### తెలంగాణలో ఎలక్ట్రానిక్ వెహికిల్స్ విప్లవం
### మహీంద్రా సంస్థకు పొన్నం కృతజ్ఞతలు


**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచే దిశగా కీలక ముందడుగు పడింది. మహీంద్రా సంస్థ తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక రాయితీలు ప్రకటించగా, దీనికి మంత్రి పొన్నం ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం రాష్ట్రంలో స్వచ్ఛమైన రవాణా వ్యవస్థకు బలం చేకూర్చుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న ఈ ప్రత్యేక డిస్కౌంట్ వల్ల ఈవీ వాహనాల కొనుగోలు మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ వాహనాల వినియోగం పెరగడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల విప్లవానికి కేంద్రబిందువుగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దిశగా ప్రభుత్వం వివిధ ప్రోత్సాహక చర్యలు చేపడుతోంది. చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలు అమలు చేస్తూ ఈ రంగాన్ని బలోపేతం చేస్తోంది. మహీంద్రా వంటి సంస్థలు ముందుకు రావడం ఈ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వంతో కలిసి పనిచేసే సంస్థలు పెరిగితే ఈవీ రంగం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మహీంద్రా సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ఈవీ వినియోగం పెరగడానికి ఇలాంటి భాగస్వామ్యం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణ స్వచ్ఛమైన రవాణా రంగంలో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## విద్యా వ్యాపారంగా..
# అడ్మిషన్ల దందా!

- పది పరీక్షలు పూర్తికాకముందే మొదలైన కాలేజీల లొల్లి
- విద్యార్థులను, తల్లిదండ్రులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న కార్పొరేట్ శక్తులు
- మీ బిడ్డను మా కాలేజీలోనే చేర్పించాలంటూ మాయమాటలు
- ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి తల్లిదండ్రులకు ఫోన్ల మీద ఫోన్లు
- పరీక్షలు ముగియక ముందే పొద్దున్నే ఇళ్ల వద్ద ప్రత్యక్షం
- గ్రామాల్లో కాలేజీల పీఆర్వోలతో ప్రత్యేక నెట్‌వర్క్
- విద్యార్థులను చేర్పించేందుకు రకరకాల ప్రలోభాలు
- ఒక్కో అడ్మిషన్‌కు రూ. 5వేల నుంచి రూ. 6వేల వరకు కమీషన్
- పరీక్షల వేళ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న వైనం
- రాష్ట్రంలోని విద్యాసంస్థల తీరుపై విస్మయం
- నిమ్మకు నీరెత్తినట్లు విద్యాశాఖ ఉన్నతాధికారులు




**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

తెలంగాణలో విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకుంది. పదో తరగతి విద్యార్థులు తమ జీవితంలో అత్యంత కీలకమైన వార్షిక పరీక్షలు రాస్తున్నారు. అయితే, విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీస్తూ, వారి భవిష్యత్తును వ్యాపార వస్తువుగా మారుస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల వేటను ముమ్మరం చేశాయి. పరీక్షలు ఇంకా పూర్తి కాకముందే, ఫలితాలు రాకముందే సీటు రిజర్వేషన్ పేరుతో కోట్లాది రూపాయల దందాను ఈ సంస్థలు సాగిస్తున్నాయి. తల్లిదండ్రుల బలహీనతలను ఆసరాగా చేసుకుని, విద్యార్థులపై మానసిక యుద్ధం ప్రకటిస్తున్నాయి.

### డేటా చోరీ.. ఫోన్ల మోత

విద్యార్థుల వ్యక్తిగత సమాచారం, ఫోన్ నంబర్లు, అడ్రస్ కార్పొరేట్ కాలేజీల చేతుల్లోకి ఎలా వెళ్తుందనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. స్కూళ్ల నుంచి లేదా ఇతర మార్గాల ద్వారా డేటాను సేకరిస్తున్న ఈ సంస్థలు, తెల్లవారుజాము నుంచే ఫోన్ల మోత మోగిస్తున్నాయి. మీ అబ్బాయి, అమ్మాయికి మంచి మార్కులు వస్తాయి, మా దగ్గర ఇప్పుడే సీటు బుక్ చేసుకుంటే ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తాం.. అంటూ ఆశ చూపుతున్నాయి. ఒక కాలేజీకి కాదంటే మరో కాలేజీ నుంచి ఫోన్లు వస్తుండటంతో తల్లిదండ్రులు విసిగిపోతున్నారు.

### గ్రామాల్లో పీఆర్ఓ టీంలు..

కేవలం ఫోన్లకే పరిమితం కాకుండా, ఈ కాలేజీలు ప్రత్యేకంగా అడ్మిషన్ టీంలను రంగంలోకి దించాయి. ఒక్కో మండలానికి, ఒక్కో గ్రామానికి పీఆర్ఓలను కేటాయించి ఇంటింటికీ పంపిస్తున్నారు. వీరు కేవలం విద్యావేత్తలు కాదు, పక్కా సేల్స్ మెన్ లాగా వ్యవహరిస్తున్నారు. మా కాలేజీలో చేరితేనే మీ పిల్లాడు డాక్టర్ అవుతాడు లేదా ఇంజనీర్ అవుతాడు అని నమ్మిస్తున్నారు. ఒక్కో అడ్మిషన్ చేయించినందుకు ఈ ఏజెంట్లకు రూ. 5వేల నుంచి రూ. 6వేల వరకు కమీషన్ ముడుతోంది. దీంతో వారు విద్యార్థుల ఇళ్ల ముందు తిష్ట వేస్తున్నారు.

### జాయిన్ అయ్యాక అదనపు వసూళ్లే..

అడ్మిషన్ సమయంలో చెప్పే ఫీజుకు, చేరిన తర్వాత వసూలు చేసే ఫీజుకు అస్సలు పొంతన ఉండదు. అడ్మిషన్ ఫీజు కాకుండా ఏసీ చార్జీలు, మెటీరియల్ ఫీజు, ఎగ్జామినేషన్ ఫీజు, స్పెషల్ కోచింగ్ ఫీజు అంటూ జాబితాను పెంచుకుంటూ పోతారు. మొదట రూ. 10వేలు లేదా రూ. 20వేలు కట్టి సీటు రిజర్వ్ చేసుకోమంటారు. ఒకవేళ విద్యార్థి వేరే కాలేజీకి వెళ్లాలనుకుంటే ఆ డబ్బును తిరిగి ఇచ్చే ప్రసక్తే ఉండదు. పాత ర్యాంకులను, ఎవరో సాధించిన విజయాలను తమవే అని ప్రచారం చేసుకుంటూ అడ్మిషన్ల కోసం తప్పుడు ప్రకటనలు ఇస్తున్నారు.

### ఒత్తిడిలో విద్యార్థులు.. ఆందోళనలో తల్లిదండ్రులు

పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఉండాల్సిన విద్యార్థులు, ఈ కాలేజీల వేధింపులతో మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. నువ్వు ఆ కాలేజీకి వెళ్తావా? ఈ కాలేజీకి వెళ్తావా? అంటూ తల్లిదండ్రులు అడిగే ప్రశ్నలు వారి ఏకాగ్రతను దెబ్బతీస్తున్నాయి. చదువు కంటే అడ్మిషన్లకే ప్రాధాన్యత ఇస్తున్న ఈ కార్పొరేట్ సంస్కృతి వల్ల విద్యార్థుల సృజనాత్మకత నశిస్తోందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు.

### నిమ్మకు నీరెత్తినట్లుగా విద్యాశాఖ

రాష్ట్రవ్యాప్తంగా ఇంత పెద్ద ఎత్తున అక్రమ అడ్మిషన్ల దందా జరుగుతున్నా, ఇంటర్మీడియట్ బోర్డు లేదా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదనేది మింగుడుపడని అంశం. నిబంధనల ప్రకారం విద్యా సంవత్సరం ముగిసి, ఫలితాలు వచ్చిన తర్వాతే అడ్మిషన్లు ప్రారంభించాలి. ప్రైవేట్ కాలేజీల ప్రచారాలపై ఆంక్షలు ఉండాలి. కానీ, క్షేత్రస్థాయిలో అధికారులు ఈ కాలేజీల యాజమాన్యాలతో చేతులు కలిపి మామూళ్ల మత్తులో మునిగిపోయారనే ఆరోపణలు వస్తున్నాయి.

### గుర్తింపు రద్దు చేయాల్సిందే..

ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి, పరీక్షలు ముగిసే వరకు ఏ కాలేజీ కూడా అడ్మిషన్లు తీసుకోకుండా, విద్యార్థులను వేధించకుండా కఠినమైన ఆదేశాలు జారీ చేయాలి. నిబంధనలు ఉల్లంఘించే కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. విద్య అనేది ఒక పవిత్రమైన ప్రక్రియ. దానిని కేవలం లాభాపేక్షతో కూడిన వ్యాపారంగా మార్చేస్తున్న కార్పొరేట్ శక్తులపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే సామాన్య, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు ఈ అడ్మిషన్ల దందాలో బుగ్గిపాలయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

# రైతులకు గుడ్ న్యూస్

### సాధాబైనామ సమస్యకు సరళ పరిష్కారం

- అఫిడవిట్ నిబంధనలో సడలింపు
- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి దారి
- భూ భారతి చట్టంలో కీలక మార్పులు
- జీవో 76తో ఊరట

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

రాష్ట్రంలో సాధాబైనామ ద్వారా భూములు కొనుగోలు చేసిన రైతులకు ప్రభుత్వం కీలక ఉపశమనం కల్పించింది. జీవో నెం.76 ద్వారా ఈ సమస్యకు సులభతర పరిష్కారం తీసుకువచ్చినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న కఠిన నిబంధనల వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, తాజా నిర్ణయం వారికి పెద్ద ఊరటగా మారనుంది. ఇప్పటి వరకు సాధాబైనామ భూముల రిజిస్ట్రేషన్ లేదా హక్కుల పరిరక్షణలో కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరి నుంచి అఫిడవిట్ తీసుకోవాల్సి వచ్చేది. కానీ అనేక సందర్భాల్లో అమ్మకందారులను గుర్తించడం, సంప్రదించడం కష్టంగా మారడంతో దరఖాస్తులు నిలిచిపోయాయి. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం, ఇకపై కొనుగోలుదారు ఒక్కరే సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చినా సరిపోతుందని నిర్ణయించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాధాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించినప్పటికీ, 2020 ఆర్.ఓ.ఆర్ చట్టంలో సరైన పరిష్కార మార్గం చూపలేకపోయింది. దీంతో సుమారు 9 లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం భూ భారతి చట్టంలో మార్పులు చేసి, శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమం చేసింది. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, అఫిడవిట్ నిబంధనలో సడలింపు తీసుకురావడం ద్వారా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వీలైనంత త్వరగా అన్ని దరఖాస్తులను పరిశీలించి, రైతులకు న్యాయం చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

# గ్యాస్ సంక్షోభంపై నిజాలు చెప్పాలి

- కొరత లేకుంటే హోటళ్లకు ఎందుకు నిలిపివేశారు
- గృహ వినియోగదారులు కూడా ఇబ్బంది పడుతున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్
- గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఆందోళన



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ఒకవైపు గ్యాస్ కొరత లేదని ప్రభుత్వం చెబుతుంటే, మరోవైపు హోటళ్లు, చిరు వ్యాపారులకు సరఫరాను నిలిపివేయడం తీవ్ర అన్యాయం అని, గ్యాస్ అందక హోటల్ వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరత సమస్యపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్ పార్క్ వద్ద గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, గ్యాస్ సంక్షోభంపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీ వైపు ర్యాలీగా బయలుదేరారు. ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా విషయంలో పారదర్శకత లేకపోవడం వల్ల ప్రజల్లో గందరగోళం నెలకొన్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను దాచిపెడుతోందని ఆరోపించారు. ఈ సమస్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్ కొరత ప్రభావం సాధారణ ప్రజలపై కూడా పడుతోందని కేటీఆర్ తెలిపారు. గృహ వినియోగదారులు కూడా సిలిండర్లు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ధరలు పెరగడం, సరఫరా ఆలస్యం వంటి సమస్యలు ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్ సరఫరా అంశంపై ప్రజలకు నిజాలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గ్యాస్ అందుబాటును పెంచాలని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్యాస్ సంక్షోభంపై స్పందించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కేటీఆర్ స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాను పెంచేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, వ్యాపారులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

## నాకు మంత్రి పదవి ఇస్తే
# పార్టీకి మంచి పేరు వస్తుంది

- తనలాంటి ఉద్యమకారులే కాంగ్రెస్ బలం
- సీఎంతో ఎలాంటి విభేదాల్లేవు
- కేటీఆర్‌తో చర్చలు సాధారణమే
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావాలంటే తనలాంటి ఉద్యమకారుల సేవలు అవసరమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మంత్రి పదవి కోసం తాను పరితపించడం లేదని, అయితే గతంలో పార్టీ అధిష్ఠానం తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిందని వెల్లడించారు. దీనిపై తుది నిర్ణయం ఏమవుతుందో తనకు తెలియదని చెప్పారు. అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ఆయన, తనకు మంత్రి పదవి ఇస్తే ప్రభుత్వం, పార్టీకి మంచి పేరు వస్తుందని వ్యాఖ్యానించారు. తాను ఎలాంటి పదవి లేకపోయినా ప్రజల్లో తనకు గౌరవం ఉందని, ప్రజా సేవే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పదవులు కంటే ప్రజల విశ్వాసమే ముఖ్యమని అన్నారు. ఈరోజు అసెంబ్లీ లాంజ్‌లో కేటీఆర్‌తో మాట్లాడిన విషయంపై కూడా ఆయన స్పందించారు. ఎలాంటి రాజకీయ చర్చలు కాకుండా సాధారణ విషయాలపైనే మాట్లాడినట్లు తెలిపారు. అయితే 2018లో 12 మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకోవడం తప్పేనని కేటీఆర్‌కు తన అభిప్రాయం చెప్పినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. నిన్న ప్రత్యేకంగా భేటీ కాలేదని, అసెంబ్లీలో ఎదురుపడితే సాధారణంగా మాట్లాడుకున్నామని తెలిపారు. పార్టీ అంతర్గత విషయాలను చర్చించుకుంటూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఉద్యమకారుల పాత్ర కీలకమని ఆయన మరోసారి పేర్కొన్నారు. భవిష్యత్తులో పార్టీ మరింత బలపడేలా పనిచేస్తామని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే దిశగా కృషి చేస్తామని వెల్లడించారు.

## షహీద్ దివస్ సందర్భంగా పలు విభాగాల్లో పోటీలు




**వేద న్యూస్, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని అగ్రహారం జేఎన్టీసీ కళాశాలలో మై భారత్ ఆధ్వర్యంలో షహీద్ దివస్ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎలక్ట్రీషన్, ఎస్సే, రైటింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ, మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామంటే అది వీరుల ప్రాణత్యాగాల ఫలితమని తెలిపారు. ప్రతి సంవత్సరం మార్చి 23న షహీద్ దివస్‌ను జరుపుకుంటామని, ఈ రోజు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగాలను స్మరించుకునే రోజు అని పేర్కొన్నారు. 1931 మార్చి 23న లాహోర్ సెంట్రల్ జైలులో బ్రిటిష్ పాలకులు వీరికి ఉరిశిక్ష విధించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన వారి త్యాగం చిరస్మరణీయమని అన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మై భారత్ వాలంటీర్ గంగిపల్లి స్వామి కుమార్, అధ్యాపకులు శ్రావణ్, రాజేష్, పూసల సంతోష్, రజినీకాంత్, జెస్సు అజీజ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## వేములవాడలో శ్రీరామనవమికి ఏర్పాట్లు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో 27న నిర్వహించనున్న సీతారాముల కళ్యాణోత్సవానికి ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ పార్కింగ్ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివార్చన వేదికపై కళ్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. భక్తులు సౌకర్యవంతంగా కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రాంగణాన్ని 15 సెక్టార్లుగా విభజించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కళ్యాణోత్సవాన్ని భక్తులు స్పష్టంగా వీక్షించేందుకు ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. భద్రతా దృష్ట్యా బ్యారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు భక్తులు సులభంగా సంచరించేందుకు గ్రీన్ మ్యాట్లు పరచనున్నారు. భక్తుల కోసం త్రాగునీరు, మజ్జిగ వంటి పానీయాలు అందుబాటులో ఉంచనున్నారు. కళ్యాణోత్సవం అనంతరం స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లు, టెంట్లు, విద్యుత్ దీపాలు, కూలర్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు స్వామివారి అన్నప్రసాదం పంపిణీ కూడా నిర్వహించనున్నారు. సీతారాముల కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవో ఎల్. రమాదేవి ఆలయ సిబ్బందికి సూచించారు

## ప్రమాదకరంగా దేశాయిపల్లి బ్రిడ్జి

- బయటకు తేలిన ఇనుప రాడ్లతో
- వాహనదారుల ప్రాణాలకు ముప్పు
- అధికారుల నిర్లక్ష్యంపై ప్రయాణికుల ఆగ్రహం





**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని దేశాయిపల్లి కెనాల్ బ్రిడ్జిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కోదురుపాక నుండి బోయినిపల్లి మీదుగా గంగాధర వరకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ఈ బ్రిడ్జి పూర్తిగా దెబ్బతిని, ప్రయాణికులకు నరకయాతనగా మారింది. బ్రిడ్జిపై రోడ్డు పాడైపోవడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. గుంతలలోని కాంక్రీట్ తొలగిపోవడంతో లోపల ఉన్న ఇనుప రాడ్లు (స్టీల్ సలాకలు) బయటకు వచ్చి వాహనదారులకు ముప్పుగా నిలుస్తున్నాయి. ప్రతిరోజూ వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో, వాహనాల టైర్లు రాడ్లకు తగిలి ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో ప్రయాణికులు వణికిపోతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంత ప్రమాదకర పరిస్థితి ఉన్నప్పటికీ అక్కడ ఎటువంటి హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. వేగంగా వచ్చే వాహనాలు గుంతల్లో పడితే ప్రాణాపాయం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ రహదారి ద్వారా అధికారులు ప్రయాణిస్తున్నప్పటికీ సమస్యపై దృష్టి సారించకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి పెను ప్రమాదం జరగకముందే సంబంధిత రోడ్డు భవనాల శాఖ (ఆర్&బి) అధికారులు, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు. బ్రిడ్జిపై గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చి, బయటకు వచ్చిన ఇనుప రాడ్లను సరిచేసి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## భీమన్నను దర్శించుకున్న విజిలెన్స్ ఎస్పీ

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా విజిలెన్స్ ఎస్పీ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మంగళవారం ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎల్. రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని ఎస్పీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విలాసాగర్‌లో ఉపాధి హామీ పనులకు శ్రీకారం

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో ఉపాధి హామీ పనులకు శ్రీకారం చుట్టారు. సర్పంచ్ ఏనుగుల కనకయ్య, ఉప సర్పంచ్ పోత్తూరి శైలజ సంయుక్తంగా ఈ పనులను ప్రారంభించారు. గ్రామ చెరువులో నిర్వహించిన కార్యక్రమంలో వార్డ్ సభ్యులు జోగు శంకర్, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొని నూతన పనులకు ప్రారంభం పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ కనకయ్య మాట్లాడుతూ.. రాబోయే ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కార్మికులు ఉదయం వేళల్లోనే పనులు ప్రారంభించి, ఎండ ఎక్కువయ్యేలోపే ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరు తగినంత తాగునీరు వెంట తీసుకెళ్లి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విలాసాగర్ ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర కనకరాజు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ఆరు గ్యారెంటీలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



- బీఆర్ఎస్ సీనియర్ నేత బుర్ర శ్రీనివాస్ గౌడ్
- ఆర్డీవోకు వినతి పత్రం సమర్పణ

**వేద న్యూస్, హుస్నాబాద్:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రామ్మూర్తికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగతా హామీలను ప్రభుత్వం పక్కన పెట్టిందని విమర్శించారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే అన్ని గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికుల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వలేదని ఆయన అన్నారు. వృద్ధులు, వికలాంగులకు పెంచుతామని చెప్పిన పింఛన్ల విషయంలో కూడా ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. రైతు భరోసా మొత్తాన్ని పెంచుతామని ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో రైతులు నిరాశకు గురయ్యారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పష్టత ఇచ్చి ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, లేకపోతే ప్రజల తరఫున పోరాటం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎంపీ రెడ్డి, శ్యాంసుందర్, జగన్, శ్రీనివాస్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ప్లాటినం జూబ్లీ ఏర్పాట్లు

**వేద న్యూస్, వరంగల్:**



వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్లాటినం జూబ్లీ వేడుకలు ఈ నెల 29న నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఏడు దశాబ్దాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై సంఘం కమిటీ సభ్యులు అధ్యక్షుడు ఇ.వి. శ్రీనివాస్ రావు అధ్యక్షతన మంగళవారం పాలిటెక్నిక్ కళాశాలలో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా కళాశాలలో జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మేకల అక్షయ్ కుమార్, ఆనంద్ కుమార్, సతీష్ రెడ్డి, టీఎన్ స్వామి, ప్రకాష్, సుధాకర్ రావు, నరేందర్ రెడ్డి, ధర్మ శ్రీనివాస్ రెడ్డి, జయశ్రీ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ వాడలో సీసీ రోడ్డు ప్రారంభం

- ఎమ్మెల్యే మేఘారెడ్డి స్థానికుల కృతజ్ఞతలు

**వేద న్యూస్, ఏదుల మండలం:**



ఏదుల మండల కేంద్రంలోని బీసీ వాడలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కృషితో ప్రారంభించారు. మండల కాంగ్రెస్ నాయకులు పందెం సుఖేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పరశురామ్ యాదవ్ మరియు గ్రామ పంచాయతీ పాలక మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కోసం రోడ్డు సౌకర్యాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏదుల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ యాదవ్, ఉపసర్పంచ్ ఉల్పాల శేశిరెడ్డి, గోపాల్పేట్ మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు జానకిరామ్ యాదవ్, వార్డు సభ్యులు కాశమ్మ సైదులు, రాముడు యాదవ్, మల్లయ్య యాదవ్, బొల్లె కృష్ణయ్య, మాజీ వార్డు సభ్యుడు హుస్సేన్, హనుమంతు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీబీపై అవగాహన కార్యక్రమం

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల జిల్లా:**



మై భారత్ ఆధ్వర్యంలో సిరిసిల్ల నర్సింగ్ కళాశాలలో వరల్డ్ టిబీ డే సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రిషన్, ఎస్సె, రైటింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమృత హాస్పిటల్ ఎండీ డాక్టర్ సురేష్ బాబు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. టీబీ నిర్మూలనకు అవగాహన, సమయానికి నిర్ధారణ, పూర్తి చికిత్స అత్యంత కీలకమని తెలిపారు. అందరం కలిసికట్టుగా పనిచేస్తే క్షయవ్యాధి నిర్మూలన సాధ్యమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా టీబీ ఒక ప్రాణాంతక అంటువ్యాధిగా కొనసాగుతోందని, 2024లో సుమారు 10.7 మిలియన్ల మంది ఈ వ్యాధికి గురై, దాదాపు 1.23 మిలియన్ల మంది మరణించినట్లు వివరించారు. ప్రపంచ టిబీ కేసుల్లో భారత్‌లోనే 26 శాతం నమోదవుతుండగా, ప్రతి ఏడాది సుమారు 30 లక్షల కొత్త కేసులు, 5 లక్షల వరకు మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. టీబీపై అపోహలు తొలగించి ప్రజల్లో సరైన అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, అధ్యాపకులు సంధ్యారాణి, చైతన్య, స్వప్నతో పాటు మై భారత్ వాలంటీర్లు గంగిపల్లి స్వామి కుమార్, పూసాల సంతోష్, రజినీకాంత్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం మార్చి 25, 2026

# బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమానికి చోటేది

## – టీఆర్పీ యూత్ అధ్యక్షుడు జి. రవికుమార్



**వేద న్యూస్, వనపర్తి:**

రాష్ట్ర బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమ నిధి, ఇళ్ల స్థలాలు, హెల్త్ స్కీమ్‌లకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం పట్ల వనపర్తి జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పి) యూత్ అధ్యక్షుడు జి. రవికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా నిలిచే మీడియాను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని విమర్శించారు. ఫీల్డ్‌లో ప్రాణాలను పణంగా పెట్టి వార్తలు సేకరించే జర్నలిస్టులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, వృద్ధాప్యంలో రూ.6 వేల పింఛన్, ప్రమాదాలు లేదా అనారోగ్య సమయంలో ఆర్థిక సహాయం అందించాలన్నారు. అలాగే జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో కనీసం జర్నలిస్టుల ప్రస్తావన కూడా లేకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి సంక్షేమానికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

# భూగర్భ జలాల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం

**వేద న్యూస్, తంగళ్ళపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా భూగర్భ జలాల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రైతు వేదికలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజలు మంచి స్పందన తెలిపారు. బస్టాండ్ నుండి రైతు వేదిక వరకు ర్యాలీ నిర్వహించి నీటి సంరక్షణపై చైతన్యం కల్పించారు. అనంతరం భూగర్భ జలాల శాఖ ఆధ్వర్యంలో పాల్గొన్న వారితో నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా భూగర్భ జలాల ప్రాధాన్యత, భవిష్యత్ తరాలకు నీటి లభ్యతను కాపాడుకోవాల్సిన అవసరం, నీటి వృథాను తగ్గించే చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో భూగర్భ జల అధికారి జి. నాగరాజు, అసిస్టెంట్ హైడ్రోజియోలాజిస్ట్ ఇ. రవీందర్, అసిస్టెంట్ హైడ్రాలజిస్ట్ ఎం. ప్రవీణ్ కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సహారా డిపాజిటర్లకు వెంటనే డబ్బులు చెల్లించాలి

## – ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

సహారా ఇండియా గ్రూప్‌లో డిపాజిట్ చేసిన బాధితులకు వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడుతూ.. అధిక వడ్డీ ఆశతో కోట్లాది మంది ప్రజలు సహారాలో తమ పొదుపులను పెట్టారని తెలిపారు. కంపెనీ మూతపడటంతో గడువు ముగిసినా డిపాజిటర్లకు డబ్బులు చెల్లించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు 2023 మార్చి 29న సహారా ఆస్తులను స్వాధీనం చేసుకుని డిపాజిటర్లకు డబ్బులు చెల్లించాలని ఆదేశించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం పరిమిత షరతులు విధిస్తూ చిన్న మొత్తాల డిపాజిట్లకే పరిమితం చేస్తోందని విమర్శించారు. ఇకనైనా ఎలాంటి షరతులు లేకుండా అన్ని డిపాజిటర్లకు డబ్బులు చెల్లించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జవ్వాజి విమల, కోడం రమణ, ఆడెపు రజిత, సందుపట్ల పోచమల్లు, గోవర్ధన్‌తో పాటు సహారా బాధితులు పాల్గొన్నారు.

# పామ్ ఆయిల్ సాగుతో రైతులు ఆర్థికంగా ఎదగాలి

## – మహమ్మద్ షఫీయోద్దీన్




**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన మహాసభలో పర్సన్ ఇంచార్జి మహమ్మద్ షఫీయోద్దీన్ రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి పామ్ ఆయిల్ సాగుపై దృష్టి పెట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. సిద్దిపేట జిల్లా నిర్మేటలో ఆయిల్ ఫ్యాక్టరీ ప్రారంభం కావడంతో పామ్ ఆయిల్ పంటకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ–వ్యయ నివేదికను, 202627 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను సభ్యులకు వివరించారు. స్వల్పకాలిక రుణాల కింద రూ.12.90 కోట్లు, దీర్ఘకాలిక రుణాల కింద రూ.13.31 కోట్లు రైతులకు అందించినట్లు తెలిపారు. వాయిదా మీరిన రూ.39.55 లక్షల రుణాలను వసూలు చేయాలని సూచించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దోమ్మాటి నరసయ్య తదితరులు మాట్లాడుతూ యూరియా, 20–20–28, డీఏపీ ఎరువులను సకాలంలో అందించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమయానికి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రామ్‌రెడ్డి, డైరెక్టర్ మెండే శ్రీనివాస్ యాదవ్, రైతులు మరియు సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ కోసం బారులు తీరిన ప్రజలు

## – కొరతతో ఎండలో గంటల తరబడి క్యూలో వినియోగదారులు

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో గ్యాస్ కొరత సమస్య తీవ్రంగా మారింది. సోమగిరి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద సిలిండర్ కోసం వినియోగదారులు భారీగా తరలి వచ్చి బారులు తీరారు. బుకింగ్ చేసినప్పటికీ సిలిండర్లు సమయానికి అందడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ పరిధిలో సుమారు 13 వేల కనెక్షన్లు ఉండగా, వారానికి ఒక్కసారి మాత్రమే గ్యాస్ లోడు రావడం వల్ల సరఫరా తగ్గిందని సమాచారం. దీంతో ప్రజలు ఎండలో గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొంతసేపు ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకుని వినియోగదారులను సముదాయించారు. ఇటీవల అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో సరఫరాలో అంతరాయం ఏర్పడిందని కొందరు భావిస్తున్నప్పటికీ దీనిపై అధికారిక స్పష్టత లేదు. గ్యాస్ కొరత సమస్యను త్వరగా పరిష్కరించి సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని వినియోగదారులు కోరుతున్నారు.

# శిక్షణ తరగతులు విజయవంతం

**వేద న్యూస్, చొప్పదండి:**



భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చొప్పదండి పట్టణంలో రెండు రోజులుగా నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా బీజేపీ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ళపెల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి బలమని, వారు ప్రజలతో కలసి పనిచేసి పార్టీ సిద్ధాంతాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణం, బూత్ స్థాయి బలోపేతం, సోషల్ మీడియా వినియోగం, ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ పాత్ర వంటి అంశాలపై కార్యకర్తలకు శిక్షణ అందించారు. ఈ శిక్షణ తరగతులను విజయవంతం చేసిన కార్యకర్తలకు నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కరండ్ల మధుకర్, జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ మరియు మండల అధ్యక్షులు చిల్ల శ్రవణ్ కుమార్, మొగిలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోనేరుపల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

## – ప్రారంభించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి



**వేద న్యూస్, చొప్పదండి:**

కోనేరుపల్లి గ్రామ పంచాయతీకి ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద మంజూరైన రూ.10 లక్షల విలువైన మురికికాలువ, సీసీ రోడ్డు పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసు వేణుగోపాల రాజు, ఎంపీడీవో వేణుగోపాలరావు, ఉప సర్పంచ్ తిరుపతి, వార్డు సభ్యులు నరేందర్, వంశిక, మమత, ప్రాంచిస్ రెడ్డి, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, సాంబయ్యపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు పెరుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నిన్న హామీ.. నేడు అమలు

## – రైతన్నకు అండగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**వేద న్యూస్, చొప్పదండి:**

రైతుల సమస్యల పరిష్కారంలో వేగంగా స్పందించే నాయకత్వానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఉదాహరణగా నిలిచారని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేష్ తెలిపారు. రైతుల విజ్ఞప్తి మేరకు మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే, ఎలాంటి ఆలస్యం లేకుండా 24 గంటల్లోనే చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌కు కొనుగోలు కేంద్రాన్ని కేటాయించారని తెలిపారు. రైతులు నష్టపోకుండా ఉండాలనే ఉద్దేశంతో తీసుకున్న ఈ నిర్ణయం ఆయనకు రైతుల పట్ల ఉన్న అనురాగాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. రైతు బిడ్డగా రైతుల కష్టాలను అర్థం చేసుకుని వెంటనే చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తెలియజేయాలని, ఎల్లప్పుడూ రైతుల వెంటే ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

# ఆధ్యాత్మికంగా సాగిన బ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటకం

**వేద న్యూస్, రామడుగు:**



మండల కేంద్రంలో కాలజ్ఞాని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి జీవిత చరిత్ర ఆధారంగా నిర్వహించిన నాటక ప్రదర్శన భక్తిశ్రద్ధలతో సాగింది. సోమవారం రాత్రి ప్రారంభమైన ఈ నాటకం మంగళవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. స్వామివారి చరిత్రను ఆసక్తిగా వీక్షించిన భక్తులు ఆధ్యాత్మిక పరవశానికి లోనయ్యారు. ఉగాది పండుగ అనంతరం ఐదవ రోజు నిర్వహించే ఈ నాటకం గత 72 సంవత్సరాలుగా స్థానిక శిల్పకారుల ఆధ్వర్యంలో నిరంతరంగా జరుగుతోంది. స్వామి జననం నుండి గోవుల కాపరిగా జీవనం సాగిస్తూ కాలజ్ఞానం బోధించిన ఘట్టాల వరకు నాటకం ఆధ్యాత్మికతను ప్రతిబింబించింది. అర్ధరాత్రి కళ్యాణ ఘట్టం, చివరగా స్వామి జీవ సమాధి ప్రదర్శనతో నాటకం ముగిసింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకొని, ఉదయం స్థానిక దేవాలయంలో తీర్థప్రసాదం స్వీకరించారు.

# కురుమూర్తి స్వామి హుండీ ఆదాయం రూ.9,37,740

**వేద న్యూస్, చిన్నచింతకుంట:**

కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే శ్రీ కురుమూర్తి స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహించగా రూ.9,37,740 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. చిన్నచింతకుంట మండలం అమ్మాపురం గ్రామ సమీపంలో ఉన్న ఈ ఆలయంలో నిర్వహించిన హుండీ లెక్కింపును ఆలయ కార్యనిర్వాహణ అధికారి మదనేశ్వర్ రెడ్డి, దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షకుడు శ్రీనివాస్ సమక్షంలో చేపట్టారు. ఈ లెక్కింపులో మాజీ చైర్మన్లు గోవర్ధన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మాజీ పాలకమండలి సభ్యులు శంకర్, కురుమూర్తి వెంకటేశ్వర్ రెడ్డి సేవా సమితి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం మార్చి 25, 2026

# రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

**- హనుమకొండ ఎస్ఈ మధుసూదన్**

**- శనిగరం సబ్‌స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం**

**వేద న్యూస్, కమలాపూర్:**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శనిగరం గ్రామంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఉన్న 5 ఎంవిఏ ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా మరో 5 ఎంవిఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమకొండ ఎస్ఈ మధుసూదన్ మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించి సహకరించాలని సిబ్బందికి సూచించారు. అదనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వల్ల శనిగరం, గోపాల్పూర్, లక్ష్మీపూర్, నేరెళ్ల, మాదన్నపేట గ్రామాల రైతులు, వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ (టి) విజేందర్ రెడ్డి, డీఈ మల్లికార్జున్, ఏడీఈ వంశీకృష్ణ, ప్రొటెక్షన్ ఏడీఈ విజయ్, టీఆర్ఈ ఏఈ విశ్వప్రసాద్, కమలాపూర్ ఏఈ రాములు, ఎస్ఎల్ఐ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

**- సాధించే వరకు ఉద్యమం ఆగదని నేతల హెచ్చరిక**

**వేద న్యూస్, జడ్చర్ల:**



జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించే వరకు ఉద్యమాన్ని ఆపబోమని రెవెన్యూ డివిజన్ సాధన సమితి కోఆర్డినేటర్లు డాక్టర్ వడ్త్యావత్ రమేష్ నాయక్, బూర్గుపల్లి కృష్ణ యాదవ్ స్పష్టం చేశారు. మంగళవారం మండల విద్యా వనరుల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, జడ్చర్ల నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, నవాబ్‌పేట్ మండలంలోని కొల్లూర్ గ్రామాన్ని మండలంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అలాగే జడ్చర్ల మండలాన్ని రూరల్, అర్బన్ మండలాలుగా విభజించాలని కోరారు. ఈ డిమాండ్‌పై గతంలో పలు దఫాలుగా ఉద్యమాలు జరిగాయని, అసెంబ్లీలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ప్రస్తావించడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు కార్యాచరణ లేకపోవడం నిరాశ కలిగించిందన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని, లేనిపక్షంలో అసెంబ్లీ ముట్టడికి దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, గోపాల్, ఆఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

# జూరాల ప్రాజెక్ట్ నుంచి పర్థిపూర్ చెరువుకు నీటి విడుదల

**- గ్రామానికి వరంగా మారిన నిర్ణయం : సర్పంచ్ శివకుమార్**

**వేద న్యూస్, చిన్నచింతకుంట:**

జూరాల ప్రాజెక్ట్ నుండి పర్థిపూర్ గ్రామ రిజర్వాయర్ చెరువుకు మంగళవారం సాయంత్రం నీటిని విడుదల చేసినట్లు గ్రామ సర్పంచ్ తెలుగు శివకుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి దూరదృష్టి ఆలోచనలతో ఈ కార్యక్రమం అమలు చేసినట్లు పేర్కొన్నారు. రైతు సంక్షేమంపై ఉన్న అంకితభావంతో తీసుకున్న ఈ నిర్ణయం గ్రామ ప్రజల ఆశలను నెరవేర్చిందన్నారు. వేసవి కాలంలో నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ నీటి విడుదల గొప్ప వరంగా మారిందని, తాగునీరు మరియు పంటల సాగుకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. దీంతో వ్యవసాయ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని చెప్పారు. జూరాల నుంచి వచ్చిన నీరు చెరువును మాత్రమే కాకుండా గ్రామ ప్రజల ఆశలను కూడా నింపిందని, ఇది గ్రామ అభివృద్ధికి కొత్త దిశను చూపించే కీలక అడుగని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల తరపున సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఐఎన్టిఎస్ఓ పరీక్షల్లో అద్భుత ఫలితాలు



**వేద న్యూస్, మందమర్రి :**

దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ పరీక్షల్లో స్థానిక మందమర్రికి చెందిన శ్రీ చైతన్య విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్, ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల్లో మొదటి బహుమతి తుంగ పిండి వర్షత్ 8వ తరగతి లెనోవా టాబ్ + గోల్డ్ మెడల్, రెండవ బహుమతి బండారి విష్ణువర్ధన్ 6వతరగతి, దండు దేవాన్ష్ 5వతరగతి స్మార్ట్ వాచ్ + గోల్డ్ మెడల్, మూడవ బహుమతి గోవర్ధనగిరి శ్రీ సుధామినీ 7వతరగతి, దండు దేశిక 3వతరగతి రెడ్ బోల్ట్ బ్యాగ్ + గోల్డ్ మెడల్, నాలుగవ బహుమతి సిరికొండ సాద్విన్ 10వతరగతి, చెరుకు శ్రీమన్ 8వతరగతి, పొన్నం శ్రీ కరణ్4వతరగతి స్పోర్ట్ వాచ్ + గోల్డ్ మెడల్, ఐదవ బహుమతి సబ్బని అనిక 9వతరగతి, అక్కేపల్లి లాస్య, కొయ్యాడ సాహిత్ గౌడ్ 5 వతరగతి లంచ్ బాక్స్+ గోల్డ్ మెడల్, 138 మంది విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులు, గోల్డ్ మెడల్ సాధించి ఎంతో ప్రతిభ కనబరచాలరని ఈ సందర్భంగా పాఠశాల ఏజీఎం అరవింద రెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ నాగరాజు, ప్రైమరీ కోఆర్డినేటర్ జయశ్రీ, పాఠశాల ప్రిన్సిపల్ రమేష్, డీన్ రవికుమార్, ఒలంపియాడ్ ఇన్చార్జ్ శ్యామల, రవీనా, ప్రైమరీ ఇన్చార్జ్ సునీత, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ తిరుమల తో పాటు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు విద్యార్థిని విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# బీడీ కూలి పెంపునకై యజమానులకు డిమాండ్ నోటీస్

**వేద న్యూస్, చిన్నచింతకుంట:**



జిల్లా బీడీ కార్మిక సంఘం (వీఆర్‌టీయూ) ఆధ్వర్యంలో బీడీ కూలి పెంపు కోసం యాజమాన్యాలకు మంగళవారం చిన్నచింతకుంటలో డిమాండ్ నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ. అబ్రహం మాట్లాడుతూ.. ప్రతి రెండు సంవత్సరాలకు జరిగే వేతన ఒప్పందం ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా 1000 బీడీలకు రూ.350 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుడు మరణించిన సందర్భంలో అంత్యక్రియల కోసం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అదేవిధంగా బీడీ కార్మికులకు గుర్తింపు కార్డులు, ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సౌకర్యం కల్పించాలని, ఆకు, పొగాకు జరిమానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నెలలో రెండుసార్లు వేతనాలు చెల్లించడంతో పాటు పీఎఫ్‌లో యాజమాన్య వాటా కూడా జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ద బాలరాజు, యువరాజు యెహాను, కోరి శ్రీనివాసులు, చిన్న కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ , సీఎంఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**

**వేద న్యూస్, పాపన్నపేట :**



ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పొడిచన్పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం పాపన్నపేటలోని మంజీరా గార్డెన్లో ఆయా గ్రామాల లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం ఆర్ ఎఫ్, చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్యం,తహసీల్దార్ సతీష్ కుమార్,ఎంపీడీఓ విష్ణువర్ధన్,హౌసింగ్ పీడీ మాణిక్యం,డీఈ ప్రసన్న,ఏఈ అరుణ్ ప్రసాద్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోవింద్ నాయక్,పాపన్నపేట,పొడ్చన్ పల్లి, కుర్తివాడ సర్పంచులు పావని నరేందర్ గౌడ్,ఏసు,చెట్టుకింది శ్రీధర్,నాయకులు ప్రభాకర్ రెడ్డి,శెట్టి శ్రీకాంత్,ప్రశాంత్ రెడ్డి,గౌస్,ఖలీమ్,నాని,సూఫి,ప్రేమ్ రాథోడ్ ,సద్దామ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ దంపతులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం

**వేద న్యూస్, దేవరకద్ర/ఆత్మకూర్:**



ఆత్మకూర్ మున్సిపల్ కేంద్రంలో నూతనంగా ఎన్నికైన 4వ వార్డు కౌన్సిలర్ అల్లి శంకరమ్మ–బాలరాజు దంపతులను మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. స్థానిక బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎం. రవికుమార్ యాదవ్ నివాసంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో దంపతులకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రీ రవికుమార్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు ఆర్. వీరేశలింగం, లక్ష్మీకాంత్ రెడ్డి, రాజ్ కిరణ్, ఎనుముల శివ, 8వ వార్డు సభ్యురాలు రేణుక విష్ణు, రమేష్, ఎనుముల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు - లారీ ఢీ..

**- ఘటన స్థలాన్ని పరిశీలించిన సీపి సాయి చైతన్య**

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండల కేంద్రంలోని జవహర్ నగర్ కాలనీలో మంగళవారం ఉదయం 11 గంటలకు బోధన్ నుండి హైదరాబాద్ వెళుతున్న ఆర్టీసీ ఎక్స్ప్రెస్ బస్సు టీజీ 16 జెడ్ 0102, వర్ని నుండి రుద్రూర్ వైపు వెళ్తున్న TS 22 T 3348 నంబరు గల డస్ట్ తో వెళ్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సు లారీ డ్రైవర్ తో సహా 20 మంది ప్రయాణికులకు గాయాలైనట్లు సమాచారం తెలుసుకున్న రుద్రూర్ ఎస్సై సాయన్న ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను నాలుగు అంబులెన్స్ ల ద్వారా బోధన్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనంతరం సంఘటన స్థలాన్ని నిజామాబాద్ సిపి సాయి చైతన్య, బోధన్ ఎసిపి శ్రీనివాస్ సందర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ అతివేగం నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెప్తున్నారు.

# మైనింగ్ అక్రమాలపై అఖిలపక్ష ఐక్యవేదిక ఫిర్యాదు

**- వనపర్తి గుట్టలు, అడవులు కాపాడాలని డిమాండ్**

**వేద న్యూస్, వనపర్తి:**



వనపర్తి జిల్లాలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు ప్రజా భవన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీఎం ప్రజావాణి కార్యక్రమంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాలుగా వనపర్తి ప్రాంతంలోని గుట్టలను అక్రమంగా తవ్వుతూ కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు. వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గుట్టలు, అడవులు వనపర్తి ప్రత్యేకత అని, అవి లేకపోతే వర్షపాతం తగ్గి ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల సహజ వనరులను సంరక్షించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా. సతీష్ యాదవ్, బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి మైబూస్, గోపాల్ రావు, బాలస్వామి, శేఖర్ నాయక్, ఎంఐఎం, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# తిక్క ఈరప్ప స్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

**- బాసు హనుమంతు నాయుడికి ఆహ్వాన పత్రిక అందజేత**

**వేద న్యూస్, గద్వాల్:**



గద్వాల జిల్లా కేటిదొడ్డి మండలం ఇర్కిచేడు గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా రేపటి నుంచి 28 వరకు నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ సద్గురు తిక్క ఈరప్ప స్వామి బ్రహ్మోత్సవాలకు బాసు హనుమంతు నాయుడిని కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు ఆహ్వానించారు. జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఆహ్వాన పత్రికను అందజేసి కార్యక్రమానికి విచ్చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చక్రధర్ రావు, జి. రాఘవేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మయ్య, గంజిపేట రాజు, జయప్ప, గోపాల్ గౌడ్, సుధాకర్, జంగిలప్ప, ఆంజనేయులు, భగవంతు, రంగారెడ్డి, రాజేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిని ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చు

## – జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వేద న్యూస్, మందమర్రి :**

క్షయ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించినట్లయితే నయం చేయవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం టి. బి. ముక్త భారత్ అభియాన్ 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మందమర్రి మండలం అందుగులపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సుధాకర్ నాయక్ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించినట్లయితే నయం చేయవచ్చని తెలిపారు. 100 రోజుల పాటు క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని, తెమడ పరీక్ష, ఎక్స్ రే తీసుకోవడం ద్వారా క్షయ వ్యాధిని గుర్తించవచ్చని, సరైన సమయంలో చికిత్స అందించినట్లయితే పూర్తిగా నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితీల పరిధిలో పరీక్షలు, చికిత్స, అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు అయినట్లయితే వ్యాధి నివారణ మరింత సులభతరం అవుతుందని తెలిపారు. క్షయ ప్రభావిత ప్రాంతాలలో 14 సంవత్సరాల పైబడిన వారందరికీ పరీక్షలు చేయడం జరుగుతుందని, మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, పోషకాహార లోపం, క్యాన్సర్ వంటి అసంక్రమణ వ్యాధులను గుర్తించడం ద్వారా క్షయ వ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సకాలంలో పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా శరీరంలో రోగ నిరోధక శక్తి పెంపొందించుకోవచ్చని, ప్రజలు సొంత ఆలోచనతో మందులు వినియోగించకూడదని, ప్రజల సౌకర్యార్థం జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖాన, పల్లె దవాఖాన, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాల ద్వారా ఉచితంగా సేవలు అందించడం జరుగుతుందని, వైద్యుల సలహా మేరకు మాత్రమే మందులు వినియోగించాలని తెలిపారు. క్షయ వ్యాధి నివారణలో భాగంగా ఆరోగ్య ఉపకేంద్రాల వైద్యులు, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. వ్యాధి పూర్తిగా నయం అయ్యేవరకు తప్పనిసరిగా వైద్యుల సూచన ప్రకారం మందులను వినియోగించాలని, వ్యాధి నయం అయిన తరువాత వైద్య పరీక్షల నివేదిక అనంతరం వైద్యుల సూచన మేరకు మాత్రమే మందుల వినియోగం ఆపాలని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు కీలు ఫౌండేషన్ ద్వారా డా. రాజ్ కిరణ్ సంస్థ ద్వారా న్యూట్రిషన్ కిట్లను అందించడం జరిగిందని, ఈ కిట్లు వినియోగించడం ద్వారా వ్యాధిని ఎదుర్కొనవచ్చని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నిశ్చయ భూషణ్ యోజన క్రింద ప్రతి నెల 1 వేయి రూపాయలు పోషణ మధ్యము చికిత్స కాలం వరకు అందించడం జరుగుతుందని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులు దగ్గిన, తుమ్మిన క్షయ క్రిములు బయటకు వస్తాయని, మాస్క్ ధరించినట్లయితే నియంత్రించవచ్చని, సాధ్యమైనంత వరకు గాలి, వెలుతురు ఉన్న ప్రాంతాలలో ఉండాలని తెలిపారు. జిల్లాలో 759 మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్సలు అందించడం జరుగుతుందని, పోషకాహారం కోసం డి బి టి ద్వారా 150 మంది రోగులకు 6 వేల రూపాయల చొప్పున పోషకాహారం కోసం అందించడం జరుగుతుందని తెలిపారు. స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో ప్రజలలో వ్యాధి నివారణ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను తొందరగా గుర్తించడం, సమయానికి మందులు అందించడం జరుగుతుందని, జిల్లాలోని రోగులకు పోషకాహారం అందే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని, క్షయ వ్యాధి రహిత జిల్లాగా మంచిర్యాలను తీర్చిదిద్దుదామని తెలిపారు. అనంతరం ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం పొన్నారం గ్రామంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్ తో కలిసి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులకు సరైన అవగాహన కల్పించి నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించుకునేలా వివరించాలని, పనులు త్వరగా పూర్తిచేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించాలని తెలిపారు. గ్రామంలో నర్సరీని సందర్శించి వేసవి అయినందున సకాలంలో నీటిని అందించి మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ సతీష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్, వైద్యాధికారులు డా. అరుణ శ్రీ, డా. రమేష్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సి పి ఓ లు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అవగాహనతోనే క్షయ వ్యాధి నిర్మూలన

- వైద్యాధికారి డాక్టర్ పి. సృజన
- వైద్య కళాశాల విద్యార్థుల అవగాహన ర్యాలీ

**వేద న్యూస్, నాగర్‌కర్నూల్:**



బిజినపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు నాగర్‌కర్నూల్ వైద్య కళాశాల విద్యార్థులు క్షయ వ్యాధి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వైద్యాధికారి డాక్టర్ పి. సృజన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్షయ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తి చికిత్సతో నిర్మూలించవచ్చని తెలిపారు. క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ర్యాలీ అనంతరం టీవీ ముక్త్ భారత్ కార్యక్రమం ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నరేష్, మెడికో సోషల్ వర్కర్ డి. బాలమ్మ, హెల్త్ సూపర్వైజర్లు అశోక్ కుమార్, చంద్రశేఖర్, టిబి సూపర్వైజర్ శ్రీనివాసులు, ఆరిఫ్, శ్రావణ్, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# దాబాలలో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



**వేదన్యూస్, రుద్రూర్ :** రుద్రూర్ మండల కేంద్రంలోని దాబాలలో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధి కారులు టి సునీత, నవిత తనిఖీలు నిర్వహించారు. దాబాల లో, ఫాస్ట్ ఫుడ్ లలో పరిశుభ్రత పాటిస్తూ నాణ్యమైన ఆహార పదార్థాలు విక్రయించాలని యజమానులకు ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఆహార నమూనాల సేకరణ, వంటగది పరిశుభ్రత పరిశీలన, ఎక్స్‌పైరీ వస్తువుల గుర్తింపు లైసెన్స్ తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి నోటీసులు జారీ చేసి, భారీ జరిమానాలు విధించడం జరుగుతుందని హెచ్చరించారు.

# సాగునీటి ప్రాజెక్టులను సందర్శించిన కలెక్టర్

## – మ్యాప్ ద్వారా సమగ్ర వివరాల ఆరా



**వేద న్యూస్, గద్వాల్:**

జిల్లాలోని పలు సాగునీటి ప్రాజెక్టులను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. మొదట ధరూర్ మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద కుడి, ఎడమ కాలువలు, సమాంతర కాలువలను పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన నీటి నిల్వ సామర్థ్యం, ఎత్తిపోతల పథకాల వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వరదల సమయంలో తీసుకునే జాగ్రత్తలు, జలవిద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలను కూడా వివరించారు. స్కాడా రూంలో ప్రాజెక్టు మ్యాప్ ద్వారా సమగ్ర వివరాలు తెలుసుకున్న కలెక్టర్, డ్యామ్ గేట్లు, నిర్మాణాలను సీసీ కెమెరాల ద్వారా పరిశీలించారు. అనంతరం గుడ్డెందొడ్డి లిఫ్ట్ పంప్ హౌస్, గ్రావిటీ కాలువలను సందర్శించి ఆపరేటింగ్ వ్యవస్థపై సమీక్షించారు. ర్యాలంపాడు రిజర్వాయర్ వద్ద అధికారులు 4 టీఎంసీల సామర్థ్యం, సుమారు 1.33 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంపై వివరాలు తెలియజేశారు. రిజర్వాయర్ కింద భూములు కోల్పోయిన రైతులకు కల్పించిన సౌకర్యాలపై కూడా కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ పర్యటనలో ఎస్ఈ రహీముద్దీన్, ఈఈలు జుబేర్ అహ్మద్, శ్రీనివాసులు, ఇతర ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల కష్టాలను తీర్చడమే ధ్యేయం

## – మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం :సర్పంచ్ ఎలికట్టి భరత్



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

గ్రామ ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యకు తక్షణ పరిష్కారం చూపడం ధ్యేయమని లక్ష్మీదేవి గూడెం సర్పంచ్ ఎలికట్టి భరత్ అన్నారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి స్పందించే నాయకత్వం ఉన్నప్పుడే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన నిరూపించారు. లక్ష్మీదేవిగూడెం పరిధిలోని ఎరకలగుట్ట ఆవాస గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు సర్పంచ్ ఎలికట్టి భరత్ శాశ్వత పరిష్కారం చూపించారు. వేసవికాలం ప్రారంభం కావడంతో గ్రామ ప్రజలు తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటూ ఇబ్బందులు పడుతుండగా సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన సర్పంచ్ భరత్, వార్డ్ మెంబర్ సందీప్ తో కలిసి మంగళవారం సంబంధిత ప్రదేశాన్ని స్వయంగా పరిశీలించి బోరు వేయడానికి అనువైన పాయింట్‌ను గుర్తించి బోరు వేయించి గ్రామానికి తాగునీటి సౌకర్యాన్ని కల్పించి ఎరకలగుట్ట గ్రామ ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా ఎరుకల గుట్ట గ్రామ ప్రజలు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి పట్ల కట్టుబడి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే నాయకత్వాన్ని సర్పంచ్ భరత్ ప్రదర్శిస్తున్నారని నీటి సమస్యను అడగగానే స్పందించి పరిష్కారం చూపిన సర్పంచ్ ఎలికట్టి భరత్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పించిన ఐద్వా నేతలు

**వేద న్యూస్ ,కారేపల్లి :**



తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మభ్యపుచ్చుతుందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, వైరా డివిజన్ అధ్యక్షురాలు కొండబోయిన ఉమావతి లు విమర్శించారు. సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలో మంగళవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జనరల్ బాడీ సమావేశం మూడు అరుణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మెరుగు రమణ, కొండబోయిన ఉమావతి లు మాట్లాడుతూ రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వస్తే మహిళలు లక్ష అధికారులను చేస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకుందన్నారు. అధికారంలోకి వచ్చాకా ఆరు గ్యారెంటీలో భాగంగా మహిళలకు రూ.2500, స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తామని, మహిళ స్వయం సంఘాల ద్వారా స్వయం ఉపాధి కల్పించి రూ.లక్షాధికారులుగా చేస్తామన్నసీఎం రేవంత్ రెడ్డి హామీని అమలు చేయడం మరిచారన్నారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్లో నిధులు కేటాయించకుండా మహిళలను రూ. లక్ష అధికారులను చేయడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతంలో పనులు దొరకక పేదలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఉపాధి హామీ పనులలో షరతులు విధించడంతో వ్యవసాయ రంగంలో పనులు దొరకక ఉపాధీ పనులు చేయక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరాన్ యుద్ధం తో గ్యాస్, ఆయిల్ ఇతర నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. ఎన్నికల హామీల అమలుకు మహిళా స్వయం ఉపాధికి బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘం ఉసిరికాయలపల్లి నూతన గ్రామ కమిటీ ని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులు ముత్తబోయిన లింగమ్మ, తేజావత్ ప్రమీల, సహాయ కార్యదర్శి మూడు అరుణ, ఉపాధ్యక్షులుగా దాసరి మంగమ్మ, కోశాధికారిగా బానోత్ సరోజిని, కమిటీ సభ్యులుగా పచ్చిపాల రాజమ్మ, దాసరి అరుణ, తొట్టి సుశీల, మారుతి కంసల్య, పసుపునుటి మహాలక్ష్మి, లింగమ్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధురాలు అమరజీవి మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

# పటిష్టంగా ఎస్సీ,ఎస్టీ,పిసిఆర్ అట్రాసిటీ యాక్ట్ అమలు

## – కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**



జిల్లాలో ఎస్సి, ఎస్టీ ప్రివెన్షన్ అఫ్ అట్రాసిటీ (పిఓఏ), పౌర హక్కుల పరిరక్షణ (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ –పిసిఆర్) యాక్ట్ కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు అందించిన వివరాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అమ్మ సేవ ఫౌండేషన్ వారు అందిస్తున్న సేవలు దృష్ట్యా అందులో ఉన్న నిరాశ్రయులకు, అనాధలకు గుర్తింపు పత్రాలు ఆధార్, ఇతరత్రా లభించేలా నిబంధన మేరకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సభ్యులు తెలిపిన సమస్యల్లో జిల్లా స్థాయిలో ఉన్న సమస్యలు ఇక్కడే త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని, పింఛన్ల జారీ, అవుట్సోర్సింగ్ ఉద్యోగం, పౌర హక్కులపై అవగాహన కార్యక్రమాలు ప్రతి నెల నిర్వహించడం, ఖమ్మం నగరం కార్పోరేషన్ 60వ డివిజన్ లో ఉన్న ఎస్సీ స్మశాన వాటికకు కాంపౌండ్ వాల్ ఏర్పాటుకు చర్యలు చేపడతామని అన్నారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్ ప్రభుత్వం అందించిన విధివిధానాల మేరకు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పలు ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాలలో ఎస్సీ, ఎస్టీలు లబ్ధిదారులకు ప్రాధాన్యత లభించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, సిపిఓ ఏ. శ్రీనివాస్, ఈడీ ఎస్సి కార్పొరేషన్ నవీన్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, సభ్యులు జె. దాస్ మహారాజ్, అన్నం శ్రీనివాసరావు, ఎం. అంజయ్య, జీవి. భద్రయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి మండలానికి 24 హైమ్యాక్స్ లైట్లు మంజూరు



**వేద న్యూస్ ,కారేపల్లి :**

సింగరేణి మండల అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రత్యేక చొరవతో సీఎస్ఆర్ నిధుల ద్వారా మండలానికి మొత్తం 24 హైమ్యాక్స్ సెంట్రల్ లైట్లు మంజూరు అయ్యాయి. గ్రామాల్లో రాత్రి సమయంలో వెలుతురు సమస్యను దృష్టిలో ఉంచుకొని ఈ లైట్లను ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా గ్రామాలలో చీకటి తగ్గి, ప్రజల భద్రత మరింత మెరుగుపడనుంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో మహిళలు, వృద్ధులు సురక్షితంగా సంచరించేందుకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ) ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మండల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకారం అందిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నందుకు ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. గ్రామ ప్రజలు కూడా ఈ నిర్ణయాన్ని హర్షిస్తూ, ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు భవిష్యత్తులో మరింతగా కొనసాగించాలని ఆకాంక్ష వ్యక్తం చేస్తున్నారు


వేద న్యూస్

బుధవారం మార్చి 25, 2026

# విద్యా తెలంగాణ...రేపటి వెలుగులు

**వేద న్యూస్ డెస్క్:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2026-27 వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి ఒక చారిత్రాత్మక మరియు దార్శనిక పీట వేసింది. "విద్య లేని వాడు వింత పశువు" అన్న మహాత్ముల మాటలను నిజం చేస్తూ, ప్రతి బిడ్డకు ఉన్నతమైన, నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ఈ బడ్జెట్ రూపొందించబడింది. విద్యారంగానికి ప్రభుత్వం ఈసారి ఏకంగా రూ.26,674 కోట్ల రూపాయలు ప్రతిపాదించడం అనేది రాష్ట్ర చరిత్రలోనే ఒక గొప్ప మలుపుగా నిలిచిపోతుంది. ఈ బడ్జెట్ కేవలం అంకెల సమ్మేళనం కాదు; ఇది తెలంగాణ భవిష్యత్తు తరాల తలరాతను మార్చే ఒక సమకాలీన దార్శనిక పత్రం. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల ఆశయాలకు అనుగుణంగా, అట్టడుగు వర్గాల పిల్లలకు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను చేరువ చేయడమే ఈ భారీ కేటాయింపుల వెనుక ఉన్న అసలైన ఉద్దేశ్యం. చదువు అనేది ఒక ఖర్చు కాదు, అది రాష్ట్రం తన భవిష్యత్తుపై చేసుకుంటున్న అత్యున్నతమైన సామాజిక పెట్టుబడి అని ఈ బడ్జెట్ నిరూపించింది. ఈ విద్యా బడ్జెట్‌లో అత్యంత కీలకమైన మరియు విప్లవాత్మక మార్పుగా "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను" పేర్కొనవచ్చు. తెలంగాణ సమాజం ఒక ఉమ్మడి వసుధైక కుటుంబంగా ఎదగాలనే సంకల్పంతో, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు ఓసీ విద్యార్థులందరూ ఒకేచోట, ఒకే విధానాన చదువుకునేందుకు వీలుగా ఈ 105 పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. దీనివల్ల చిన్న వయసులోనే విద్యార్థుల మధ్య కుల, మత వివక్షలు తొలగిపోయి, ఒక సామాజిక సమసమానత్వ పునాది పడుతుంది. ఇప్పటికే 79 స్కూళ్లు మంజూరు కాగా, 44 చోట్ల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇది రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని అందించే దిశగా ప్రభుత్వం వేసిన ఒక గొప్ప అడుగు. ఈ స్కూళ్లలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక వసతులు, డిజిటల్ తరగతి గదులు మరియు అత్యాధునిక క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతున్నారు. పాఠశాల స్థాయి నుండే విద్యార్థుల పోషణ మరియు ఆరోగ్యం పైన ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపింది. దీనిలో భాగంగా భారతదేశంలోనే తొలిసారిగా "బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని" ప్రీ-ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులందరికీ విస్తరించారు. ప్రతి విద్యార్థికి వారానికి మూడు రోజులు పాలు మరియు మూడు రోజులు రాగిజావ అందించడం వల్ల వారి మెదస్సు మరియు ఆరోగ్యం మెరుగుపడుతుంది. "తెలంగాణలో ఏ ఒక్క బిడ్డ కూడా ఆకలితో స్కూలు రోజువారీ పనులను మొదలుపెట్టకూడదు" అనే ప్రభుత్వ సంకల్పం ఎంతో మానవీయమైనది. ఈ కార్యక్రమం వల్ల స్కూళ్లలో హాజరు శాతం పెరగడమే కాకుండా, మధ్యలోనే చదువు మానేసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది. దీనితోపాటు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు కూడా ఈసారి నుండి మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించారు. కౌమార దశలో ఉండే ఇంటర్ విద్యార్థులకు పోషకాహారం ఎంతో అవసరం అనే వాస్తవాన్ని గుర్తించిన ప్రభుత్వాన్ని ఎంతో అభినందించాలి. దీనివల్ల ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే పేద విద్యార్థులకు గొప్ప ఊరట లభిస్తుంది. అదేవిధంగా, "తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు" అనే నూతన విధానంతో ప్రభుత్వ స్కూళ్లను అత్యున్నత మౌలిక వసతులు, డిజిటల్ సదుపాయాలు మరియు ప్రత్యేక రవాణా వ్యవస్థలతో కూడిన క్యాంపస్‌లుగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రీ-ప్రైమరీ నుండి 12వ తరగతి వరకు ఒకే క్యాంపస్ లో 1500 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం దీని లక్ష్యం. బాలికా విద్యను ప్రోత్సహించేందుకు 93 కె.జి.బి.విలను "యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్" గా మార్చారు మరియు మరో 120 కె.జి.బి.వి లను ఇంటర్మీడియట్ స్థాయికి పెంచారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని ఆడపిల్లలు ఉన్నత చదువులకు దూరం కాకుండా రక్షణ లభిస్తుంది. దివ్యాంగ విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎటువంటి అడ్డంకి కలుగకూడదు అనే లక్ష్యంతో, ఇంటర్ చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు 'రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్' వాహనాలను అందజేస్తున్నారు. పాఠశాలల్లోని వంటశాలల ఆధునీకరణకు బడ్జెట్‌లో రూ.100 కోట్ల రూపాయలు ప్రతిపాదించారు. దీనివల్ల విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో వండిన ఆరోగ్యకరమైన భోజనం అందుతుంది. ఉన్నత విద్య మరియు విశ్వవిద్యాలయాల అభివృద్ధికి కూడా ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. చారిత్రక ఉస్మానియా విశ్వవిద్యాలయానికి మౌలిక వసతుల కల్పన కోసం ఏకంగా రూ.1000 కోట్ల రూపాయలు, మరియు వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి రూ.400 కోట్ల రూపాయలు ప్రతిపాదించారు. ఇవే కాకుండా పాలమూరు, శాతవాహన, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయాల పరిధిలో కొత్తగా ఇంజనీరింగ్, లా మరియు ఫార్మసీ కళాశాలలను మంజూరు చేసి, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో "డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ" ని స్థాపించడం వల్ల భూగర్భ శాస్త్ర రంగంలో పరిశోధనలకు గొప్ప అవకాశం కలుగుతుంది. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి కూడా తోడ్పాటు లభిస్తుంది. ఉన్నత విద్యలో నాణ్యతను పెంచడం ద్వారా తెలంగాణను దేశానికే విద్యా హబ్‌గా మార్చాలనే ప్రభుత్వ లక్ష్యం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. సాంకేతిక విద్య మరియు నైపుణ్యాల పైన ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నేటి పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీలు ఉంటే సరిపోదని, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగానే 65 ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లగా ఉన్నతీకరించడమే కాకుండా, మరో 53 ఏటీసీలను కొత్తగా మంజూరు చేశారు. వెరసి 118 ఏటీసీలు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి రానున్నాయి. ఈ కేంద్రాలలో శిక్షణ పొందే ట్రైనీలకు నెలకు రూ.2,000 స్టైపెండ్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించడం నిరుద్యోగ యువతకు గొప్ప ప్రోత్సాహం. అటు విద్యావంతులైన నిరుద్యోగుల సమస్యలను, ఇటు పరిశ్రమల అవసరాలను ఒకేసారి తీర్చే దిశగా "యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ" ని స్థాపించారు. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే మహా సంకల్పంతో, లక్షలాది మంది నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేయడమే దీని లక్ష్యం. పాఠశాల విద్య నుండి ఉన్నత విద్య వరకు ప్రతి దశలోనూ పారదర్శకతను మరియు జవాబుదారీతనాన్ని పెంచేందుకు ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్‌ను ప్రోత్సహిస్తోంది. స్కూళ్లలో టీచర్ల కొరత లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, వారి నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను రూపొందించారు. విద్యా వ్యవస్థలో రాజకీయ జోక్యాన్ని తగ్గించి, కేవలం విద్యా ప్రమాణాలకే ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సకాలంలో ఖర్చు అయ్యేలా ఒక పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడం కూడా ప్రశంసించదగ్గ విషయం. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతను పెంచడం ద్వారా మధ్యతరగతి మరియు పేద వర్గాలపై విద్యా ఖర్చుల భారాన్ని తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది దీర్ఘకాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. మొత్తానికి చూస్తే, ఈ 2026-27 విద్యా బడ్జెట్ కేవలం ఒక ఖర్చు కాదు, అది రాష్ట్ర భవిష్యత్తు పైన చేసిన ఒక గొప్ప సామాజిక పెట్టుబడి. అమ్మ కలలు, పిల్లల చదువు ఇవే తెలంగాణ భవిష్యత్తు అనే దార్శనికత ఈ బడ్జెట్‌లో ప్రతి అక్షరానా కనిపిస్తున్నది. "పేదవాడి కన్నీరు తుడిచిన నాడే నిజమైన అభివృద్ధి" అనే మహాత్మా గాంధీ మాటలను గుర్తుచేసుకుంటూ, ప్రతి బిడ్డ చదువే తెలంగాణ ప్రగతి అనే ధ్యేయంతో సాగుతున్న ఈ ప్రభుత్వ విధానాలు ఎంతో ప్రశంసనీయం. ఈ బడ్జెట్ అందరికీ సమాన అవకాశాలు కల్పించి, తెలంగాణ బిడ్డలను విశ్వ వేదికపై విజేతలుగా నిలబెడుతుంది అనే నమ్మకం బలంగా కనిపిస్తున్నది. విద్యావంతుడైన పౌరుడే దేశానికి అసలైన ఆస్తి అని నమ్ముతున్న ఈ ప్రభుత్వం, ఆ దిశగా వేసిన ప్రతి అడుగు పటిష్టమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుంది. ఈ విద్యా విప్లవం రేపటి తెలంగాణను ప్రపంచ పటంలో ఒక వెలుగు దివ్వెలా నిలబెడుతుందనడంలో సందేహం లేదు.



పురుషోత్తం నారగౌని
సీనియర్ జర్నలిస్ట్,
సామాజిక విశ్లేషకులు

## డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

నేటి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని మెరిట్ విద్యాసంస్థల అధినేత కందుల శంకరయ్య పిలుపునిచ్చారు. ముదిగొండ మండల పరిధిలోని సాయి మెరిట్ హైస్కూల్‌లో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా విద్యార్థుల భద్రత మరియు డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూరంపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కందుల శంకరయ్య మాట్లాడుతూ..ప్రస్తుత కాలంలో డ్రగ్స్ మహమ్మారి యువతను పట్టిపీడిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో కూడిన చదువే ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని పేర్కొన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలను, అవి కుటుంబాలపై చూపే ప్రతికూల ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. పిల్లల రక్షణ విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ప్రధానోపాధ్యాయులు సూరంపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. విద్యార్థులు తమ పాఠశాల పరిసరాల్లో గానీ, బయట గానీ అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే




పెద్దలకు సమాచారం అందించాలని సూచించారు. అపరిచితులు ఇచ్చే వస్తువులకు, తినుబండారాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులందరూ డ్రగ్స్ రహిత సమాజం కోసం పట్టుదలతో కృషి చేస్తామని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఇలాంటి చైతన్య కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంచుతాయనీ నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అభయ ఆంజనేయ స్వామి సన్నిధిలో తాగునీటి సౌకర్యం

### - సర్పంచ్ హేమలత బాలాజీ చేతుల మీదుగా బోరు ప్రారంభం

**వేదన్యూస్,కారేపల్లి :**

సింగరేణి మండలంలోని పోలంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణంలో భక్తుల సౌకర్యార్థం తాగునీటి బోరు ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ చర్యతో దేవాలయానికి వచ్చే భక్తులకు తాగునీటి సమస్యకు ఉపశమనం కలిగింది. ఈ బోరు ఏర్పాటు ఎంపీ రఘురాం రెడ్డి సహకారంతో సాధ్యమైందని గ్రామస్థులు తెలిపారు. దేవాలయానికి వచ్చే భక్తులు, గ్రామ ప్రజలు ఎండాకాలంలో ఎదుర్కొనే తాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ బోరును గ్రామ సర్పంచ్



హేమలత బాలాజీ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, యువత పాల్గొన్నారు. ముఖ్యంగా యూత్ ప్రెసిడెంట్ ధోని నాయక్ చురుకుగా వ్యవహరించి పనులను సమన్వయం చేస్తూ బోరు పనులు త్వరగా పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించినట్లు ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామ ప్రజలు మాట్లాడుతూ, దేవాలయ సన్నిధిలో తాగునీటి సౌకర్యం కల్పించడం ఎంతో శ్రేయస్కరమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత కొనసాగాలని ఆకాంక్షించారు.

## క్షయ రహిత జిల్లా కోసం కృషి చేద్దాం

### - కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**వేద న్యూస్, హనుమకొండ:**

హనుమకొండ జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని నిర్వహించగా జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడారు. హై రిస్క్ ఉన్న గ్రామాలలో స్క్రీనింగ్ పరీక్షల నిర్వహించాలని అన్నారు. వంద శాతం స్క్రీనింగ్ పరీక్షలు జరగాలన్నారు. టీబీ బారిన పడిన వారికి ప్రభుత్వంతో ప్రైవేట్ ఆస్పత్రులు, ఉద్యోగుల నుండి పౌష్టిక ఆహారం కలిగిన న్యూట్రిషన్ కిట్లను అందజేయడం అభినందనీయమన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ కీలకపాత్రను పోషించాలన్నారు. వచ్చే ఏడాది ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం నాటికి హనుమకొండ జిల్లాను టీబీ ముక్త్ జిల్లాగా చేసేందుకు ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని, అందుకు కృషి చేయాలని కోరారు. టిబి వ్యాధి లక్షణాల బారిన పడి నిర్ధారణ అయిన వారు ఆరు నెలలపాటు సరైన మందులు, పౌష్టిక ఆహారం తీసుకున్నట్లయితే వ్యాధి నుంచి కోలుకోవచ్చని అన్నారు. అందరూ ఆలోచించి కలిసి పనిచేస్తే టీబీ నివారించవచ్చునని పేర్కొన్నారు. కొన్ని గ్రామాలలో వంద శాతం స్క్రీనింగ్ చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో టీబీ నియంత్రణకు కృషి చేస్తామని అధికారులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా 630 మంది టీబీ చికిత్స తీసుకుంటున్న వారికి న్యూట్రిషన్ కిట్స్ అందించిన ఆదిత్య హాస్పిటల్,ఇండియన్ రెడ్ క్రాస్ ,చక్రవర్తి హాస్పిటల్,ప్రతిమ రిలీఫ్ , ప్రశాంతి హాస్పిటల్,శ్రీ చక్ర ఆస్పత్రుల వారికి, అదేవిధంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించి ఇతరులు వీరిని ఆదర్శంగా తీసుకుని ముందుకు రావాలన్నారు. టీబీ చాంపియన్ లు, టీబీ నియంత్రణ లో కృషిచేసిన సిబ్బందికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా





పత్రాలు అందించారు. ఈ సందర్భంగా పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ మాట్లాడుతూ టీబీ లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా డాక్టర్ల వద్ద పరీక్ష చేయించుకుని నిర్ధారణ అయితే చికిత్స తీసుకోవాలని, చికిత్స కాలంలో మంచి పోషకాహారం తీసుకోవాలని అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ రెండవ దశ కార్యక్రమంలో 100 రోజుల క్యాంపెయిన్ ను ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ అంశములను దృష్టిలో పెట్టుకొని 2,492 గ్రామాలను హైరిస్క్ గ్రామాలుగా గుర్తించగా మన జిల్లాలో 25 గ్రామాలను హై రిస్క్ గ్రామాలుగా గుర్తించడం జరిగినది. ఈ గ్రామాలలో వంద రోజులలో 14 సంవత్సరంలు పైబడిన వారందరినీ పరీక్షించి, ఎక్స్రే మరియు సిబి నాట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 2025 సంవత్సరంలో 1614 టీవీ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించడం జరిగింది.1416 మందికి కిచ పూర్తి కావడం జరిగింది అలాగే 252 మందికి నిక్షయ్ పోషన్ యోజన ద్వారా ప్రతినెల 1000 రూపాయలు చొప్పున ఆరు నెలల కాలం పాటు అందించడం జరిగిందన్నారు

## రాజీ మార్గమే రాజ మార్గం

- ఈ నెల 28వరకు జాతీయ లోక్ అదాలత్
- కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
  జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్

**వేద న్యూస్, ఆసిఫాబాద్:**

జిల్లా ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, కోర్టుల పరిధిలో ఉన్న వివిధ కేసులను లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. తక్కువ ఖర్చుతో, త్వరితగతిన న్యాయం పొందేందుకు ఇది ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...ఈ నెల 28 వరకు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు పాల్గొని తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్న చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు వంటి అంశాలను లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకునే మంచి అవకాశం ఇదని, శాంతియుతంగా ఇరు పక్షాల అంగీకారంతో సమస్యలు పరిష్కారం అయ్యే విధానం లోక్ అదాలత్ అని తెలిపారు. కోర్టుల్లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎస్పీ వెల్లడించారు.



వేద న్యూస్

బుధవారం మార్చి 25, 2026

# శ్రీలీలకు వరుస ఫ్లాపులు..



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో సెన్సేషనల్ ఎంట్రీతో ప్రేక్షకులను ఆకట్టుకున్న శ్రీలీల చాలా తక్కువ సమయంలోనే స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలు దక్కించుకుని బిజీ హీరోయిన్‌గా ఎదిగింది. తన డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో యూత్‌లో ప్రత్యేక క్రేజ్ సంపాదించిన ఈ బ్యూటీ ప్రస్తుతం కెరీర్‌లో కాస్త కఠిన దశను ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. 'భగవంత్ కేసరి' వంటి కొన్ని సినిమాలు మినహా, ఆమె నటించిన అనేక చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయాయి. ఈ నేపథ్యంలో తాజాగా విడుదలైన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాపై ఆమె భారీ ఆశలు పెట్టుకుంది. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ హీరోగా నటించడం సినిమాకు మంచి హైప్ తీసుకువచ్చింది. అయితే సినిమా విడుదల తర్వాత పరిస్థితి ఆశించిన విధంగా లేకపోవడం గమనార్హం. విమర్శకుల నుంచి నెగటివ్ టాక్ రావడంతో పాటు, బాక్సాఫీస్ వద్ద కూడా చిత్రం ప్రదర్శన నిరాశపరిచింది. ముఖ్యంగా ఈ సినిమాలో శ్రీలీల పాత్రకు పెద్దగా ప్రాధాన్యం లేకపోవడం ప్రేక్షకులను నిరుత్సాహానికి గురిచేసింది. పవన్ కళ్యాణ్‌తో జోడీ విషయంలో సోషల్ మీడియాలో ట్రోలింగ్ కూడా ఎదురవుతోంది. క్యారెక్టర్ డిజైన్ బలహీనంగా ఉండటం, నటనకు పెద్దగా అవకాశం లేకపోవడం వంటి అంశాలు విమర్శలకు దారితీశాయి. ఒకప్పుడు వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు అందుకున్న శ్రీలీల ఇప్పుడు తన ఫామ్‌ను తిరిగి అందుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక వరుస పరాజయాల మధ్య కూడా ఆమె పారితోషికాన్ని తగ్గించలేదన్న వార్తలు పరిశ్రమలో చర్చనీయాంశంగా మారాయి. దీంతో కొందరు నిర్మాతలు ఇతర హీరోయిన్ల వైపు మొగ్గు చూపుతున్నారని సమాచారం. ప్రస్తుతం పెద్ద ప్రాజెక్టులు చేతిలో లేకపోవడం కూడా ఆమె కెరీర్‌పై ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితుల్లో శ్రీలీల బాలీవుడ్ వైపు దృష్టి సారించినట్లు టాక్ వినిపిస్తోంది. కొత్త అవకాశాల కోసం హిందీ చిత్రసీమలో ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. టాలీవుడ్‌లో మళ్లీ తన స్థానం దక్కించుకునేందుకు ఆమె తీసుకునే నిర్ణయాలు ఎలా ఉంటాయో చూడాలి.

# ప్రభాస్ అభిమానులకి గుడ్ న్యూస్..!

**వేద న్యూస్ డెస్క్:**






పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు గుడ్ న్యూస్ అందింది. ఆయన కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చిన సూపర్ హిట్ చిత్రం డార్లింగ్ మళ్లీ రీ-రిలీజ్ రూపంలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఏప్రిల్ 23న ఈ చిత్రం గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుండటం ఫ్యాన్స్‌లో ఆనందాన్ని నింపుతోంది. 2010లో విడుదలైన ఈ చిత్రం అప్పట్లో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించింది. ముఖ్యంగా ప్రభాస్ నటన, స్టైలిష్ లుక్, కామెడీ టైమింగ్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా తర్వాతే ఆయనకు "డార్లింగ్" అనే పేరు అభిమానుల్లో బలంగా స్థిరపడింది. ఈ సినిమా ఒక హృద్యమైన ప్రేమకథగా తెరకెక్కింది. విదేశాల నుంచి భారత్‌కు వచ్చిన హీరో, తన చిన్ననాటి స్నేహితురాలు నందిని పాత్రలో నటించిన కాజల్ అగర్వాల్ను మళ్లీ కలుసుకుంటాడు. ఆ పరిచయం ప్రేమగా మారుతుంది. అదే సమయంలో గ్యాంగ్‌స్టర్ కుమార్తె నిషా కూడా హీరోను ప్రేమించడం కథలో ఆసక్తికర మలుపు తీసుకొస్తుంది. ఈ లవ్ ట్రైయాంగిల్‌లో వచ్చే ఎమోషనల్, కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను విపరీతంగా అలరించాయి. ఈ చిత్రాన్ని ఏ కరుణాకరన్ దర్శకత్వం వహించారు. ఆయన ప్రత్యేక కథనం, ఫీల్ గుడ్ ఎలిమెంట్స్ ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ప్రభాస్‌కాజల్ కెమిస్ట్రీ కూడా విజయానికి కీలకంగా మారింది. ఇక ప్రస్తుతం ప్రభాస్ వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్నాడు. ది రాజాసాబ్, ఫౌజీ, అలాగే సలార్ పార్ట్ 2 శౌర్యాంగ పర్వం, స్పిరిట్ వంటి పాన్ ఇండియా ప్రాజెక్టులు లైన్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'డార్లింగ్' రీ-రిలీజ్‌తో అభిమానులు మళ్లీ థియేటర్లలో పాత జ్ఞాపకాలను ఆస్వాదించే అవకాశం దక్కించుకోనున్నారు. ఈ రీ-రిలీజ్ కూడా మంచి స్పందన తెచ్చుకుంటుందా అనే ఆసక్తి నెలకొంది.

## బలగం బ్యూటీతో కాలభైరవ ప్రేమాయణం?




**వేద న్యూస్ డెస్క్:**

ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఎం ఎం కీరవాణి పెద్ద కుమారుడు, గాయకుడు మరియు సంగీత దర్శకుడు కాలభైరవ త్వరలో పెళ్లి పీటలు ఎక్కబోతున్నాడనే వార్తలు టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారాయి. 'బలగం' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న యువ నటి కావ్య కళ్యాణ్ రామ్తో ఆయన ప్రేమలో ఉన్నారనే ప్రచారం నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ ఇద్దరి పరిచయం ఉస్తాద్ సినిమా సమయంలో ఏర్పడిందని తెలుస్తోంది. ఈ సినిమాలో కాలభైరవ తమ్ముడు శ్రీసింహా హీరోగా నటించగా, కావ్య హీరోయిన్‌గా కనిపించింది. షూటింగ్ సమయంలో మొదలైన పరిచయం క్రమంగా ప్రేమగా మారిందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. గత కొంతకాలంగా వీరిద్దరూ రహస్యంగా డేటింగ్‌లో ఉన్నారని, ఇప్పుడు ఈ బంధాన్ని పెళ్లిగా మార్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం అందుతున్న వార్తల ప్రకారం, ఈ విషయాన్ని ఇరు కుటుంబాల పెద్దలు కూడా అంగీకరించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే శ్రీసింహా వివాహం పూర్తికావడంతో, ఇప్పుడు కాలభైరవ పెళ్లి పనులపై దృష్టి పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఈ ఇద్దరూ కలిసి ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కనిపించడం కూడా ఈ వార్తలకు మరింత బలం చేకూర్చింది. అయితే ఈ ప్రేమ, పెళ్లి వార్తలపై కాలభైరవ గానీ, కావ్య కళ్యాణ్ రామ్ గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. త్వరలోనే ఈ విషయంపై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. కావ్య కళ్యాణ్ రామ్ చిన్నప్పుడే 'గంగోత్రి', 'ఠాగూర్', 'బన్నీ' వంటి చిత్రాల్లో బాలనటిగా నటించి మెప్పించింది. తరువాత మసూద, బలగం వంటి చిత్రాలతో హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ప్రస్తుతం ఈ ప్రేమాయణం వార్తలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.

# దీపికా మెడపై వెరైటీ టాటూ..

**వేద న్యూస్ డెస్క్:**





బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకొణెకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న ఈ భామ, ఇటీవల తన మెడపై ఉన్న టాటూతో మళ్లీ వార్తల్లో నిలిచింది. హీరో రణవీర్ సింగ్ను వివాహం చేసుకున్న దీపికా, పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో రాణిస్తూ అభిమానులను ఆకట్టుకుంది. పాన్ ఇండియా ప్రాజెక్టులు, హాలీవుడ్ సినిమాలతో తన రేంజ్‌ను మరింత పెంచుకుంది. అయితే ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోటోలలో ఆమె మెడపై కనిపించిన '82E' అనే టాటూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ టాటూ అర్థం ఏమిటా అని నెటిజన్లు ఆరా తీస్తున్నారు. వాస్తవానికి '82E' అనేది దీపికా స్థాపించిన స్కిన్ కేర్ బ్రాండ్ పేరు. ఈ బ్రాండ్‌ను ఆమె 2022లో ప్రారంభించి, చర్మ సంరక్షణ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. తన సొంత బ్రాండ్‌ను ప్రమోట్ చేసే విధంగా మెడపై టాటూ వేయించుకోవడం విశేషంగా మారింది. ఇప్పటికే పలు రంగాల్లో తన ప్రతిభను చాటుకున్న దీపికా, వ్యాపార రంగంలోనూ సక్సెస్ అవుతూ ముందుకు సాగుతోంది. తన బ్రాండ్‌ను ఇలా ప్రత్యేకంగా ప్రదర్శించడం అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది.


## ఆ సినిమా చేసినందుకు నన్ను ట్రోల్ చేశారు..

**వేద న్యూస్ డెస్క్:**



టాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా ఎదిగిన కీర్తి సురేష్ తన సినీ ప్రయాణంలో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకుంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'నేను శైలజ' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, తన సహజమైన నటనతో మొదటి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఆ తరువాత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ముందుకు సాగారు. ప్రత్యేకంగా 'మహానటి' సినిమా ఆమె కెరీర్‌ను పూర్తిగా మలిచిన చిత్రం అని చెప్పాలి. అలనాటి మహానటి సావిత్రి జీవితం ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో సావిత్రి పాత్రను పోషించడం చిన్న విషయం కాదని, అది ఒక పెద్ద బాధ్యతగా భావించానని కీర్తి సురేష్ తెలిపారు. ఆ పాత్రను స్వీకరించే సమయంలో తనకు ఎంతో భయం వేసిందని, ఆ పాత్రను న్యాయం చేయలేనేమో అన్న సందేహం వెంటాడిందని ఆమె వెల్లడించారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, "మహానటి సినిమాలో నటించేందుకు మొదట నేను ఒప్పుకోలేదు. సావిత్రి గారి స్థాయి చాలా గొప్పది. ఆమె జీవితాన్ని తెరపై చూపించడం అంటే చాలా బాధ్యత. నేను ఆ పాత్రకు సరిపోతానా లేదా అన్న అనుమానం కలిగింది. కానీ దర్శకుడు నాగ్ అశ్విన్ నాకు ఎంతో ధైర్యం చెప్పారు. ఆయన నాపై ఉంచిన నమ్మకం నాకు కూడా నమ్మకాన్ని ఇచ్చింది. ఆ ప్రోత్సాహంతోనే చివరికి ఆ సినిమా చేయడానికి ఒప్పుకున్నాను" అని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మరో ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. "నేను ఈ పాత్ర చేస్తున్నానని తెలిసిన తర్వాత కొందరు నన్ను ట్రోల్ చేశారు. అయితే ఆ విషయం నాకు షూటింగ్ సమయంలో తెలియలేదు. సినిమా పూర్తయ్యాక, ప్రమోషన్స్ సమయంలో మాత్రమే తెలిసింది. మొదట్లో కొంత బాధ కలిగినా, తర్వాత నేను వాటిని పెద్దగా పట్టించుకోలేదు. ఎందుకంటే నేను చేసిన పని మీద నాకు నమ్మకం ఉంది" అని ఆమె తెలిపారు.


## 'మోవానా' తెలుగు ట్రైలర్ వచ్చేసింది!




**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన యానిమేషన్ చిత్రం మోవానా ఇప్పుడు సరికొత్త రూపంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 2016లో విడుదలై సూపర్ హిట్ సాధించిన ఈ చిత్రం ఇప్పుడు లైవ్ యాక్షన్‌గా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా జూలై 10న గ్రాండ్‌గా విడుదల కానుండగా, తాజాగా తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ లైవ్ యాక్షన్ వెర్షన్‌లో, ఒరిజినల్ చిత్రంలో మౌయి పాత్రకు గొంతు అందించిన డ్వేన్ జాన్సన్ ఇప్పుడు అదే పాత్రలో వెండితెరపై కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో ఆయన మేకోవర్, పొడవైన జుట్టు, ఒంటినిండా టాటూలతో ఉన్న లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది.

## 'ఏఏ22'లో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్..?




**వేద న్యూస్ డెస్క్:**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'ఏఏ22'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ దక్షిణంతో పాటు ఉత్తర భారతదేశంలో కూడా భారీ హైప్‌ను సృష్టించింది. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రచార కంటెంట్ విడుదల చేయకుండా మేకర్స్ గట్టి రహస్యాన్ని కొనసాగిస్తున్నారు. ఇటీవల అట్లీ తన సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న ఒక లయన్ పోస్టర్ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఆ పోస్టర్‌లో సింహం ముఖం రెండు వేర్వేరు భాగాలుగా కనిపించడం విశేషం. దీంతో ఈ చిత్రంలో అల్లు అర్జున్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారా? లేక ఒక క్లిష్టమైన, బహుముఖ పాత్రలో నటిస్తున్నారా? అన్న అనుమానాలు అభిమానుల్లో మొదలయ్యాయి. అట్లీ పోస్టర్‌కు జతచేసిన "నీలా ఎవరూ ఉండలేరు, అదే నీ శక్తి" అనే వ్యాఖ్య మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది హీరో పాత్రలోని విభిన్న కోణాలను సూచిస్తోందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ సుమారు 600 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఈ స్థాయి వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది. అల్లు అర్జున్ ఇప్పటికే పాన్ ఇండియా స్టార్‌గా తన స్థాయిని నిరూపించుకోగా, అట్లీ తన మాస్ కమర్షియల్ శైలితో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టిస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 8న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదలయ్యే అవకాశం ఉందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, అభిమానులు ఆ రోజుకై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. లయన్ పోస్టర్ నిజంగా కథపై సంకేతమా? లేక కేవలం ఆసక్తి పెంచే ప్రయత్నమా? అన్నది టీజర్ విడుదలయ్యే వరకు వేచి చూడాల్సిందే.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073